సాక్షి
ఖమ్మం
ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



మనోధైర్యమే.. మందు

పోలీసు శాఖలో ఇటీవల ఇద్దరు ఆత్మహత్య చేసుకోవడం ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరాన్ని తెలియచేస్తోంది. 8లో



ఏళ్లుగా దక్కని పదోన్నతులు

కేటీపీఎస్ 5, 6వ దశ కర్మాగారంలో పలువురు సిబ్బందికి ఏళ్లుగా పదోన్నతులు దక్కక నిరాశ అలుముకుంటోంది. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 23°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు



అనుగ్రహ భాషణం చేస్తున్న బాలబ్రహ్మానంద సరస్వతీ స్వామి

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి పాదంతో పాటు స్వామి మూల విరాట్‌కు పంచామృతంతో అభిషేకం, స్వామి, అమ్మ వార్ల కల్యాణం జరిపించారు. ఆతర్వాత తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తుల సమక్షాన పల్లకీ సేవ చేశారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఆలయాన్ని ఏపీలోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన నైమిశారణ్యం పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతీ స్వామి దర్శించి పూజలు నిర్వహించడమేకాక పాటు భక్తులకు శ్రీ వెంకటేశ్వర వైభవంపై అనుగ్రహ భాషణం చేశారు. స్వహస్తాలతో భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈకార్యక్రమాల్లో ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌తోనే చిన్నారులకు రక్షణ



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ రమణ

ఖమ్మంఅర్బన్: చిన్నారులకు టీకాలే రక్షణగా నిలుస్తాయని, అందుకే 12 ప్రాణాంతక వ్యాధుల నుండి కాపాడేందుకు తల్లిదండ్రులు వాక్సిన్లు వేయించాలని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్‌వీ.రమణ సూచించారు. మంచుకొండ పీహెచ్‌సీ పరిధిలోని ఖానాపురం, పాండురంగాపురం, రఘునాథపాలెం మండలం రేగులచలకల్లో శనివారం ఆయన వ్యాక్సినేషన్ శిబిరాలను పరిశీలించారు. ఆయా సెంటర్లలో హాజరైన గర్భిణులు, బాలింతలకు టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ గర్భిణులతో పాటు పిల్లలకు క్రమంగా తప్పక వ్యాక్సిన్లు వేసి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. సీహెచ్‌ఓ రమాదేవి, సిబ్బంది ప్రమీల, రమాదేవి, సత్యవాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల్లో తేడా ఉంటే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

బోనకల్: ఎరువులు, పురుగు మందుల షాపుల యజమానులు రికార్డుల్లో పూర్తి వివరాలు నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య ఆదేశించారు. రికార్డులు, స్టాక్‌కు తేడా ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో షాపులను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించాక డీఏఓ మాట్లాడుతూ రైతులకు పూర్తి వివరాలతో కూడిన బిల్లులు ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్‌లో అమ్మకం వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఏఓ కొండూరి విజయభాస్కర్‌రెడ్డి, ఏఈఓ నాగినేని నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల బదిలీ

కారేపల్లి: కారేపల్లి మోడల్ స్కూల్ నుంచి ఒకేసారి ప్రిన్సిపాల్ ఎండీ.అక్తర్‌తో పాటు 18మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు అందాయి. కారేపల్లిలో మోడల్ స్కూల్‌ను 2013లో ప్రారంభించగా, 11ఏళ్ల పాటు విధులు నిర్వర్తించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు బదిలీ కావడం గమనార్హం. కాగా, కారేపల్లి మోడల్ స్కూల్‌లో ఏటా పదో తరగతి విద్యార్థులు సత్తా చాటుతుండగా, బాసరలో ట్రిపుల్ ఐటీలో పలువురు సీట్లు సాధిస్తున్నారు. అంతేకాక స్వచ్ఛ భారత్‌లో ఈ పాఠశాలకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఇదిలా ఉండగా ప్రిన్సిపాల్ అక్తర్ మరిపెడ మోడల్ స్కూల్‌కు, అక్కడి ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ కారేపల్లికి బదిలీ అయ్యారు. ఇక ఉపాధ్యాయులు మరిపెడ, పెనుబల్లి మండలం టేకులపల్లి, డోర్నకల్ మోడల్ స్కూళ్లకు బదిలీపై వెళ్లారు.

పూలకింత..!

సినిమాల్లోని పాటల్లో.. విహారయాత్రకు కాశ్మీర్ లేదా బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లినప్పుడు మాత్రమే చూసే జర్బెరా పూలకు జిల్లాలోని మధిర కేరాఫ్‌గా మారింది. తెలుగు రాష్ట్రాల ప్రజలు బెంగళూరు బంతిగా పిలుచుకునే ఈ పంట లాభాలు కురిపిస్తోంది. వాస్తవానికి జర్బెరా పంట సాగుకు చల్లటి వాతావరణం ఉండాలి. అందుకే బెంగళూరు పరిసర ప్రాంతాల్లోనే రైతులు సాగు చేసేవారు. ఇటీవల ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడం, సంప్రదాయ పంటలతో వరుస నష్టాలు వస్తుండడంతో మధిరకు చెందిన మల్లాది హనుమంతరావు ప్రయోగాత్మకంగా ప్రత్యేక షేడ్ నెట్లలో ఈ పంట సాగు చేస్తుండగా లాభాలను చూసి మరికొందరు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. – మధిర



రవాణాకు సిద్ధం చేసిన పూల బంచ్‌లు

మధిరలో జర్బెరా పూల సాగు

- ప్రత్యేక షేడ్‌నెట్లలో సాగు చేస్తున్న రైతు
- వాణిజ్య పంటలకు దీటుగా లాభాలు
- విజయవాడ, రాజమండ్రికి ఎగుమతి, స్థానికంగానూ గిరాకీ
- ఆసక్తి చూపుతున్న ఇంకొందరు రైతులు



పాలీహౌస్‌లో సాగవుతున్న జర్బెరా మొక్కలు

సండే స్పెషల్

నష్టాల నుంచి ఆలోచన

మధిర మండలం ఆత్కూరు వద్ద రెండెకరాల పొలం కలిగిన మల్లాది హనుమంతరావు గతంలో పత్తి, మిర్చిసాగు చేసినా నష్టాలు ఎదురయ్యాయి. ఆ సమయంలో పలు ఫంక్షన్లకు వెళ్లిన ఆయన అక్కడ అలంకరణకు ఉపయోగించిన జర్బెరా పూలు ఎక్కడి నుంచి తెప్పిస్తున్నారని ఆరా తీశారు. హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి తీసుకొస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. ఆపై చేవెళ్లలో కొందరు పాలీహౌస్‌ల్లో సాగు చేస్తున్నారని తెలుసుకున్న ఆయన అక్కడకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడ ఎవరూ జర్బెరా సాగు చేయకపోవడం, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తేలడంతో నేషనల్ హార్టికల్చర్ బోర్డు(ఎన్‌హెచ్‌బీ) అధికారులను సంప్రదించాడు. ఎకరంలో పాలీ హౌస్ ఏర్పాటు చేయడంతో పాటు పూల మొక్కలను కొనుగోలు చేసేందుకు సుమారు రూ.60 లక్షలు ఖర్చవుతుందని, ఇందులో రూ.30లక్షల మేర సబ్సిడీ వస్తుందని చెప్పడంతో బ్యాంకు నుంచి రూ.40 లక్షల రుణం తీసుకొని ఐదు నెలల క్రితం సాగు మొదలుపెట్టారు. పూణేలోని కేఎఫ్ బయోప్లాంట్స్ నుంచి రూ.42 చొప్పున మొక్కలు కొనుగోలు చేసిన ఆయన తెలుపు, గులాబీ, పసుపు, ఎరుపు, ఆరెంజ్ రంగుల్లో పూలసాగు ప్రారంభించారు.



పూలను ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం

కంపెనీ ప్రతినిధుల సూచనలు...

పొలంలో వర్షపు నీరు వృథా కాకుండా పాలీహౌస్ పక్కన సంప్ నిర్మించి డ్రిప్ ద్వారా మొక్కలకు నీరు సరఫరా చేస్తున్నారు. అలాగే, మందుల పిచికారికి ప్రత్యేక పైపులు ఏర్పాటు చేశారు. ఇక మొక్కలు సమకూర్చిన కేఎఫ్ బయోప్లాంట్స్ కంపెనీ ప్రతినిధులు నెలలో రెండు సార్లు వచ్చి పరిశీలించి సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇక పాలీహౌస్‌లో రోజుకు పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

ఎగుమతి.. స్థానికంగా అమ్మకం

పాలీహౌస్‌లో పూలు అందుబాటులోకి వస్తుండడంతో శ్రీ లక్ష్మీతిరుపతమ్మ ఫ్లవర్స్ పేరుతో విజయవాడ, రాజమండ్రికి ఎగుమతి చేయడమే కాక స్థానికంగా వేడుకల సమయాన డెకరేషన్ సంస్థల ప్రతినిధులకు అందిస్తున్నారు. దీంతో ఇన్నాళ్లు బెంగళూరు, హైదరాబాద్ నుంచి పూలు తెప్పించుకున్న నిర్వాహకులు ఇక్కడే కొనుగోలు చేసి సమయం, ఖర్చులు తగ్గించుకుంటున్నారు. అన్ సీజన్‌లో పువ్వు రూ.2 చొప్పున, సీజన్‌లో రూ.15 నుంచి రూ.18వరకు ధర పలుకుతోంది. దీంతో ఖర్చులు పోగా ఏడాదికి రూ.2 లక్షల లాభం వచ్చే అవకాశముంది. ఒక్కో కట్ట(బంచ్)కు 10పూలు చొప్పున బాక్స్‌లో 40 కట్టలు ప్యాక్ చేసి ఎగుమతి చేస్తున్నారు.

మంచి లాభాలు గ్యారంటీ



పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తే ఒక్కోసారి పెట్టుబడి కూడా రావడం లేదు. అందరూ ఒకే రకం పంటలు కాకుండా జర్బెరా పూలతో పాటు ఇతర పంటలపై దృష్టి సారిస్తే లాభాలు పొందొచ్చు. మన ప్రాంతంలో ఈ పూలకు ఎప్పటికీ డిమాండ్ ఉంటుంది. ఖర్చులన్నీ పోను ఏటా రూ.2 లక్షల వరకు లాభం వస్తుంది.
– మల్లాది హనుమంతరావు, పాలీహౌస్ యజమాని

టెన్షన్ తగ్గింది



ఏదైనా ఫంక్షన్‌కు జర్బెరా పూలు తెప్పించాలంటే ఒక రోజు ముందుగానే విజయవాడ లేదా హైదరాబాద్ ఆర్డర్ చెప్పాలి. అక్కడ ఎంత ధర ఉంటుందో తెలియదు. అయినా పూలు ఇక్కడకు చేరే వరకు టెన్షనే. ప్రస్తుతం ఆత్కూరు సమీపాన పాలీ హౌస్‌లో తక్కువ ధరకు లభిస్తుండడంతో మా ఇక్కట్లు తీరాయి.
– కృష్ణ, డెకరేటర్, మధిర

అందుబాటులో అందమైన పూలు



జర్బెరా పూల సాగు బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా చేపడతారు. కానీ ఇప్పుడు మాకు సమీపాన సాగు చేస్తుండడంతో తక్కువ ధరకే పూలు లభిస్తున్నాయి. త్వరలో మా ఇంట్లో ఫంక్షన్ ఉంది. ఇక్కడ పూలు సాగు చేస్తున్న విషయం తెలిసి చూద్దామని వచ్చాం. పూలకు ఆర్డర్ కూడా ఇస్తున్నాం.
– ఎం.లక్ష్మి, నందిగామ

సాయుధ పోరాటం భావితరాలకు ఆదర్శం



బోనకల్ : గోవిందాపురంలో స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి/ముదిగొండ/బోనకల్/: నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భావితరాలకు ఆదర్శమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి, నేలకొండపల్లి, ముదిగొండ మండలం గోకినేపల్లి బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్)లో సాయుధ పోరాట అమరుల స్తూపాల వద్ద హేమంతరావు, నాయకులు శనివారం నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉవ్వెత్తున జరిగిందని తెలిపారు. రజాకార్లకు వ్యతిరేకంగా ఆయుధాలు పట్టి పోరాడిన చరిత్ర ఇక్కడి యోధులకు ఉందని చెప్పారు. నాడు ప్రతీ పల్లెలో రజాకార్లు భూస్వాములకు కొమ్ముకాసి పేదలను చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. ఎందరో పోరాట యోధులు రజాకార్లను వ్యతిరేకించి ప్రాణాలు కోల్పోయారని.. వారికి గుర్తుగా స్తూపాలు నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కాగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సాయుధ తెలంగాణ పోరాట చరిత్రను వక్రీకరిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యాన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నేటి తరానికి తెలిపేందుకే వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు మహమ్మద్ మౌలానా, దంతాల బాలరాజు, రాధాకృష్ణ, రామ్మూర్తినాయక్, ఇంటూరి వెంకటేశ్వరరావు, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, లతాదేవి, పోటు కళావతి, కర్నాటి భానుప్రసాద్, రావులపాటి శ్రీనివాసరావు, పయ్యావుల లింగయ్య, షేక్ మౌలాలి, జక్కుల రామారావు, సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, దొండపాడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన కాల్వల పునరుద్ధరణ



తిరుమలాయపాలెం మండలం రావిచెట్టుతండా వద్ద ఆకేరుపై కొట్టుకుపోయిన బ్రిడ్జి, రహదారిని పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

- నాలుగు రోజుల్లోగా రైతులకు సాగునీరు
- ఇళ్లు కోల్పోయిన వారికి నెలాఖరులోగా 'ఇందిరమ్మ' పథకం ద్వారా నిధులు
- రాష్ట్ర రెవెన్యూ, సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కట్టుకాచారంలో అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి

కూసుమంచి/తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: ఇటీవల భారీవర్షాలతో పాలేరు ఎడమ కాల్వకు పడిన గండి వద్ద మరమ్మతులు త్వరగా పూర్తిచేసి రైతులకు సాగునీరు ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. మంత్రి శనివారం కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కూసుమంచి మండలం హట్యా తండా వద్ద పాలేరు ఎడమ కాల్వకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించి తాత్కాలికంగా చేపడుతున్న పనులు, శాశ్వత పనులపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ప్రస్తుతం రైతులకు సాగునీరు ఇవ్వడానికి చేపడుతున్న పనులతో సమాంతరంగా శాశ్వత పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు. నాలుగు రోజుల్లోగా పొలాలకు సాగునీరు వదలాలని తెలిపారు. కాగా, భారీ వర్షాలు, వరదతో రాష్ట్రంలో దాదాపు రూ.10,300 కోట్ల మేర నష్టం ఎదురైందని, ఇళ్లు, పొలాలు, రోడ్లు, బ్రిడ్జిలను కోల్పోయామని చెప్పారు. ఇప్పటికే కేంద్రానికి నివేదిక ఇవ్వగా, కేంద్రబృందం కూడా పరిశీలించిందని.. త్వరలోనే సీఎం నేతృత్వాన ఢిల్లీకి వెళ్లి ప్రధాని, కేంద్రమంత్రులను కలిసి వరద సాయంపై చర్చిస్తామని వెల్లడించారు. అయితే, కేంద్రం నుంచి నిధులు వచ్చినా, రాకపోయినా వరద బాధితులను ఆదుకుంటామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల పరిహారాన్ని త్వరలో జమ చేయనుండగా, పూర్తిగా ఇళ్లు నష్టపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రూ.5లక్షలు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ఇక భవిష్యత్‌లో వరదలు వస్తే సహాయక చర్యలు వేగంగా జరిగేలా రాష్ట్రంలోని ఎనిమిది బెటాలియన్ల నుంచి 100మంది చొప్పున సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ ఇప్పించడమే కాక కావాల్సిన సామగ్రి సమకూరుస్తామని వెల్లడించారు. అనంతరం కూసుమంచి మండలం మల్లాయిగూడెం, నేలకొండపల్లి మండలంలోని కట్టు కాచారం, తిరుమలాయపాలెం మండలం రావిచెట్టు తండా వద్ద దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జి, విద్యుత్ లైన్ల పునరుద్ధరణపై సూచనలు చేశారు. ఇరిగేషన్ ఈఈలు వెంకటేశ్వరరావు, అనన్య, ఆర్ అండ్ బీ ఎస్ఈ హేమలత, ఖమ్మం ఆర్డీఓ జి.గణేష్, ఏడీఏ సరిత, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు కొర్లకుంట్ల నాగేశ్వరరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, భద్రయ్య, బోయిన వేణు, ఏటుకూరి పుల్లయ్య, బొందయ్య, లక్కం ఏడుకొండలు, కడియాల నరేష్, ఈవూరి శ్రీనివాసరెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనం పాతది.. ఆలోచన కొత్తది !

- బైక్‌కు బ్యాటరీ అమర్చిన యువకుడు
- రెండు గంటల చార్జింగ్‌తో 80 కిలోమీటర్లు..



పాత ద్విచక్ర వాహనానికి బ్యాటరీ అమరుస్తున్న మోహంత్

కరకగూడెం: పట్టుదల, అంకితభావం ఉంటే ఏదైనా సాధ్యమేనని నిరూపించాడు ఈ యువకుడు. మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి మోహంత్ బీటెక్ ఈఈఈ చేశాడు. సరైన అవకాశాలు రాక కరకగూడెంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో పక్కన పడేసిన తన ద్విచక్ర వాహనాన్ని బ్యాటరీతో నడిపించాలనే ఆలోచన వచ్చింది. వెంటనే చెన్నైలోని తన ఇంజనీరింగ్ మిత్రుడిని ఫోన్ ద్వారా సంప్రదించాడు. అతడి సూచన మేరకు రూ.25వేలు వెచ్చించి విద్యుత్ మోటార్, బ్యాటరీ తదితర వస్తువులు కొనుగోలు చేశాడు. తనకున్న పరిజ్ఞానంతో వారం రోజులు కష్టపడి వాహనం బ్యాటరీతో నడిచేలా చేశాడు. రెండు గంటల పాటు చార్జింగ్ పెడితే 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చని ఈ సందర్భంగా మోహంత్ చెప్పాడు. ప్రభుత్వం సహకారం అందిస్తే ఇంకా మరిన్ని ఆవిష్కరణలు చేయగలనని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాలు విరివిగా లభిస్తున్నా వాటి ధర సామాన్యులకు అందుబాటులో లేదని, ఇలాంటి తరుణంలో తమ లాంటి యువతను ప్రభుత్వం గుర్తిస్తే వాహనదారులకు మేలు జరుగుతుందని ఆయన తెలిపాడు.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం వైభవగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

నిమజ్జనం సాఫీగా సాగేలా...

- గణేష్ నిమజ్జనానికి 800మందికి పైగా పోలీసులతో బందోబస్తు
- ఏరియాల వారీగా శోభాయాత్ర రూట్‌మ్యాప్ ఖరారు
- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సునీల్‌దత్



రూట్ మ్యాప్‌పై సూచనలు చేస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: తొమ్మిది రోజుల పాటు వినాయకుడిని ఘనంగా పూజించిన భక్తులు ప్రతిమల నిమజ్జనానికి సిద్ధమవుతున్నారు. ఖమ్మంతో పాటు జిల్లావ్యాప్తంగా సోమవారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనుండగా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో ప్రకాశ్‌నగర్, బొక్కలగడ్డలోని నిమజ్జన ఘాట్లను శనివారం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ పరిశీలించారు. గణేష్ విగ్రహాల శోభాయాత్ర సాఫీగాసాగేలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లుచేయడంతో పాటు రూట్‌మ్యాప్ ఖరారు చేసినట్లు తెలిపారు. ఆయా మార్గాల్లో సోమవారం ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని చెప్పారు. రెవెన్యూ మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, వైద్య, విద్యుత్ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. కాగా, ఏడుగురు ఏసీపీలు, 18 మంది సీఐలు, 62మంది ఎస్సైలు, ఏఎస్సైలు, 175 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 405మంది కానిస్టేబుళ్లు, 159మంది హోంగార్డులను బందోబస్తు విధులకు కేటాయించినట్లు చెప్పారు. ఇక జిల్లా కేంద్రంలోని అన్ని సీసీ కెమెరాలను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షిస్తామని తెలిపారు. కాగా, శోభాయాత్రలకు ఇక్కట్లు ఎదురుకాకుండా ట్రాఫిక్ మళ్లించనున్నందున వాహనాదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని సీపీ సూచించారు.

మరికొన్ని సూచనలు

అలాగే, నిమజ్జనం అనంతరం వాహనదారులు పోలీసులు సూచించిన ప్రాంతాల మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. ఇక సోమవారం ప్రకాష్‌నగర్ బ్రిడ్జి, కాల్వొడ్డు బ్రిడ్జి ద్వారా ఇరువైపులా అన్నిరకాల వాహనాల రాకపోకలను గణనాథుల నిమజ్జనం పూర్తయ్యేంత వరకు నిలిపివేస్తారు. అయితే, రాపర్తినగర్ – కరుణగిరి బ్రిడ్జి ద్వారా సాధారణ వాహనాలను మాత్రం అనుమతిస్తారు. అలాగే, మయూరి సెంటర్ బ్రిడ్జి పైనుంచి ఇతర వాహనాలు కానీ, గణనాథుల శోభాయాత్రను కానీ అనుమతించరు. నిమజ్జనం అనంతరం రాపర్తినగర్, న్యూబస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, మమత ఆస్పత్రి వైపు వెళ్లే వాహనాలకు నెహ్రూసర్కిల్ నుంచి ఎఫ్‌సీఐ గోదాంల మీదుగా అనుమతి ఉండదు. ఆయా వాహనాలు కాల్వొడ్డు, త్రీటౌన్ పోలీస్ స్టేషన్, మిర్చి మార్కెట్, చర్చి కాంపౌండ్, చెరువు బజార్, జెడ్పీ సెంటర్, ఇల్లెందు క్రాస్ మీదుగా వెళ్లాలి. ఇక ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట, జలగంనగర్, పెద్ద తండా, సాయిప్రభాతనగర్, సాయిగణేష్ నగర్, సూర్యనగర్, కరుణగిరి, రాజీవ్ గృహకల్ప, ఏదులాపురం, ముత్తగూడెం, రెడ్డిపల్లి ప్రాంతాల గణనాథుడి విగ్రహాలను నాయుడుపేట వైపు ఏర్పాటుచేసిన మున్నేరు రాంప్ వద్ద, తీర్థాల, మంగళగూడెం, మద్దివారిగూడెం, పోలిశెట్టిగూడెం, గూడూరుపాడు, తనగంపాడు, కస్నాతండ, కాచిరాజుగూడెం, ఎం.వీ.పాలెం, ఆరెకోడు, ఆరెకోడు తండ, వల్య తండా, పిట్టలవారిగూడెం, పోలేపల్లి, గొల్లపాడు, పల్లెగూడెం ప్రాంతాల విగ్రహాలను తీర్థాల వద్ద మున్నేరులో నిమజ్జనానికి తీసుకెళ్లాలని సీపీ సూచించారు.

శోభాయాత్ర మార్గాలు ఇవే...

- మామిళ్లగూడెం ఏరియా నుంచి విగ్రహాలను మయూరిసెంటర్, కిన్నెర పాయింట్, చర్చి కాంపౌండ్ మీదుగా నిమజ్జనం పాయింట్‌కు తీసుకురావాలి.
- ఆర్‌టీఏ కార్యాలయం, బ్యాంక్ కాలనీ ప్రాంతం గణేష్ విగ్రహాల శోభాయాత్ర ఎన్టీఆర్ సర్కిల్, ఇల్లెందు క్రాస్, జెడ్పీ సెంటర్, చర్చి కాంపౌండ్ నుంచి నిమజ్జనం పాయింట్‌కు రావాలి.
- రోటరీ నగర్, ఇందిరానగర్ ప్రాంతంలో ప్రతిష్ఠించిన విగ్రహాలను మమత క్రాస్ రోడ్డు, ఇల్లెందు క్రాస్, జెడ్పీ సెంటర్, చర్చి కాంపౌండ్ మీదుగా తీసుకెళ్లాలి.
- కస్బాబజార్, కమాన్‌బజార్ ప్రాంతం నుంచి గణేష్ విగ్రహాల ఊరేగింపును చర్చి కాంపౌండ్ మీదుగా నిమజ్జనం పాయింట్‌కు చేర్చాలి.
- గొల్లగూడెం శ్రీనగర్‌కాలనీ, లకారం ట్యాంక్ బండ్ ప్రాంత విగ్రహాలను ట్యాంక్ బండ్, టాటా మోటార్స్, చెర్వుబజార్, చర్చి కాంపౌండ్ మీదుగా తీసుకెళ్లాలి.
- శ్రీరామ్‌హిల్స్, ముస్తాఫానగర్ ప్రాంతంలో ప్రతిష్ఠించిన విగ్రహాలను ముస్తాఫానగర్, చర్చి కాంపౌండ్ నుంచి నిమజ్జనం పాయింట్‌కు చేర్చాలి.
- ఖమ్మం వైరారోడ్ ప్రాంతం నుంచి విగ్రహాల ఊరేగింపు జెడ్పీసెంటర్, చెర్వుబజార్, చర్చి కాంపౌండ్ మీదుగా కొనసాగించాలి.
- సారధినగర్, గాంధీ చౌక్ ప్రాంతం నుంచి శోభాయాత్ర నాయుడు స్కిల్స్, పీఎస్ఆర్ రోడ్, గుంటి మల్లన్న, ట్రంక్‌రోడ్, నయాబజార్ మీదుగా నిమజ్జనం పాయింట్ చేరాలి.

క్లుప్తంగా

‘సీ ఫోర్’ జాబితాలో ‘న్యూవిజన్’కు మొదటి ర్యాంక్


అవార్డు అందుకుంటున్న డైరెక్టర్ కార్తీక్

ఖమ్మంసహకారనగర్: ఉన్నత ప్రమాణాలతో బోధన అందిస్తున్న పాఠశాలలకు సీ ఫోర్ సంస్థ జాతీయస్థాయిలో ర్యాంకింగ్స్ ప్రకటిస్తుండగా ఈ ఏడాది న్యూవిజన్ స్కూల్‌కు రాష్ట్రస్థాయిలో 30, జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంక్ లభించింది. ఈ విషయాన్ని విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్, డైరెక్టర్లు సీహెచ్ కార్తీక్, గోపీచంద్ తెలిపారు. ఈ నెల 11న న్యూఢిల్లీలో జరిగిన వేడుకలో డైరెక్టర్ సీహెచ్ కార్తీక్ ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ.. దేశంలోని ప్రముఖ ఐఐటీలు, ఎన్‌ఐటీలు, మెడికల్ కళాశాలల్లో తమ విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎండీ అబాద్ అలీ, జేవీ మైకెల్, సీహెచ్ మాధవి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

భద్రాచలంటౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీలో ప్రవేశాలకు ఈ నెల 30 వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్, కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఒకేషనల్, ఐటీఐ డిప్లొమా, ఓపెన్ ఇంటర్ అర్హత కలిగి ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7382929639 నంబర్‌లో లేదా www.braou.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రమేష్

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక గ్రామంలో శనివారం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను అశ్వారావుపేట కాంగ్రెస్ నాయకుడు జూపల్లి రమేష్ ప్రారంభించి మాట్లాడారు. పోటీలకు జిల్లాతోపాటు ఏపీలోని ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల నుంచి మొత్తం 50 జట్లు హాజరయ్యాయి. పోటీల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.20,116, రూ.15,116, రూ.10,116, రూ.8,116, రూ.5,116 చొప్పున నగదు బహుమతి అందిస్తామని కమిటీ బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూపల్లి ప్రమోద్, కునసోతు లింగయ్య, నల్లపు నరసింహారావు, ఎస్‌కే.కరీం, పసుపులేటి రాము, సోడెం రాజే

పోడుభూమి విషయంలో ఘర్షణ

కారేపల్లి: పోడు భూమి విషయమై రెండు వర్గాల నడుమ ఘర్షణ చోటు చేసుకోగా కారేపల్లి పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మండలంలోని చీమలపాడుకు చెందిన మాలోతు కిశోర్, మాలోతు రామ్‌కోటితో పాటు మరికొందరు, అదే గ్రామానికి చెందిన అజ్మీరా రంజిత్, అజ్మీర మహేశ్‌తో పాటు ఇంకొందరి నడుమ అటవీహక్కు పత్రాలు(ఆర్‌ఓఎఫ్‌ఆర్) జారీ అయిన నాటి నుంచి పోడు భూముల విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భూమి తమదంటే తమదని శనివారం కూడా ఘర్షణ పడి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.రాజారాం తెలిపారు.

సీఎల్‌సీ నాయకుల అరెస్ట్ గర్హనీయం

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలం రఘునాథపాలెం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్ స్థలం పరిశీలనకు వెళ్తున్న పౌర హక్కుల సంఘం (సీఎల్‌సీ) నాయకులను అరెస్ట్ చేయడం గర్హనీయమని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామిక హక్కులు గ్యారంటీ అని ప్రకటించిన ప్రభుత్వం.. విచారణకు కూడా హక్కుల సంఘం నాయకులను అనుమతించకపోవడం అన్యాయమని మండిపడ్డారు.

రేపటి గిరిజన దర్బార్ రద్దు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో రేపు (సోమవారం) నిర్వహించే గిరిజన దర్బార్‌ను మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా రద్దు చేసినట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజు కావడంతో ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండరని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. గిరిజనులు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు అందజేసేందుకు రావొద్దని సూచించారు.

మనోధైర్యమే.. మందు



రక్షకభటులు ఆపత్కాలంలో ప్రజలకు అండగా ఉండటంతోపాటు శాంతిభద్రతలను పరిరక్షిస్తారు. అలాంటివారు సమస్యలు ఎదురైతే బలవన్మరణాలకు పాల్పడుతుండటం పలువురిని విచారానికి గురిచేస్తోంది. మానసిక వేదనకు గురైనా, వృత్తిపరమైన సమస్యలు వచ్చినా ఎదిరించాలే తప్ప తలొగ్గవద్దని, క్షణికావేశంలో నిర్ణయం తీసుకుని జీవితాలను అర్ధంతరంగా ముగించడం సరికాదని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడేలా చేయొద్దని చెబుతున్నారు. జిల్లాలో ఐదు నెలల వ్యవధిలో ఇద్దరు పోలీసులు ఆత్మహత్య చేసుకున్నారు. ఒకరు ఎస్‌ఐ కాగా, మరొకరు కానిస్టేబుల్. ప్రజలకు కష్టాలు వస్తే పోలీసులు గుర్తుకు వస్తారని, అలాంటివారు సమస్య ఎదురైతే మనోధైర్యం వీడొద్దని వైద్యులు చెబుతున్నారు. – కొత్తగూడెంటౌన్

ఎంత పెద్ద కష్టమొచ్చినా ఆత్మహత్య పరిష్కారం కాదు

- సమస్య ఎదురైనపుడు పరిష్కార మార్గం అన్వేషించాలి
- ఐదు నెలల్లో జిల్లాలో ఇద్దరు పోలీసుల ఆత్మహత్య
- క్షణికావేశ నిర్ణయాలు సరికాదంటున్న మానసిక నిపుణులు
- పోలీసుశాఖలో పర్యవేక్షణ పెంచాలని కోరుతున్న సిబ్బంది

ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్..



అశ్వారావుపేట ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీరాముల శ్రీనివాస్ గత జూన్ 30న ఆత్మహత్య చేసుకున్నాడు. తాను పనిచేస్తున్న పోలీసు స్టేషన్‌లో నలుగురు తోటి ఉద్యోగులు వేధింపులకు గురి చేస్తున్నారని, అక్కడ విధుల్లో చేరిన ఐదు నెలల్లో నాలుగు మెమోలు ఇచ్చారని, దీంతో మనస్తాపం చెంది బలవన్మరణానికి పాల్పడినట్లు ప్రచారం సాగింది. తోటి ఉద్యోగులు ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విషయంపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదనే భావనకు వచ్చిన తర్వాతే ఆత్మహత్యకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి. ఎస్సై కుటుంబ సభ్యులు సైతం వేధించిన వారిపై ఫిర్యాదు చేశారు.

కానిస్టేబుల్ నాగ రమణారెడ్డి..



పాల్వంచకు చెందిన కానిస్టేబుల్ నాగరమణారెడ్డి క్లూస్ టీం విభాగంలో కొత్తగూడెంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 6న భద్రాచలం వద్ద బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత ఆగస్టు నెలలో జరిగిన కారు ప్రమాదంలో గాయాలు కావడం, భారీ వర్షాల కారణంగా తన తండ్రి కట్టుకున్న ఇల్లు వరదల్లో దెబ్బ తినడం తదితర సమస్యలతో మనోవేదనకు గురై బలవన్మరణం చెందాడు. సెల్ఫీ వీడియోలో తాను పడుతున్న బాధను వివరించారు.

మా సమస్యలూ వినాలంటున్న పోలీసులు

జిల్లాలో పోలీసులకు సమస్యలు వస్తే ఉన్నతాధికారులకు విన్నవిస్తుంటారు. జిల్లావ్యాప్తంగా 28 పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను డివిజన్, జిల్లాస్థాయి అధికారులు పరిష్కరించాల్సి ఉంది. పోలీస్ అధికారుల సంఘం కూడా సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది. అయితే ప్రత్యేకంగా సమస్యలను ఎదుర్కొనే సిబ్బందిని గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. నెలలో ఒకసారైనా సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవించేలా ఒక కార్యక్రమాన్ని నిర్వహించాలని పలువురు పోలీసు సిబ్బంది వేడుకుంటున్నారు.

క్షణికావేశంలో నిర్ణయం తీసుకోవద్దు



ఎవరైనా సమస్య వస్తే అదే తలుచుకుని మధనపడకుండా బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, డాక్టర్లతో చర్చించి సమస్యల పరిష్కారానికి ఆలోచన చేయాలి. దాదాపు అందరూ మానసిక ఒత్తిడికి గురై మనోవేదన చెందుతుంటారు. కష్టం వచ్చినప్పుడు దాని నుంచి బయటపడే మార్గం అన్వేషించాలి. అంతేకానీ ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు. కుటుంబాలను అనాథలుగా మిగల్చొద్దు. మనోధైర్యానికి మించిన మందు లేదు.

–డాక్టర్ జి.వరుణ్‌కుమార్, అసిస్టెంట్ సివిల్ సర్జన్

ఆపన్నహస్తం అందించరూ..

- సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న నర్సింగ్ విద్యార్థిని
- ఆర్థిక స్తోమత లేక చికిత్స అందించలేకపోతున్న తల్లిదండ్రులు


నడవలేని స్థితిలో ఉన్న నర్సింగ్ విద్యార్థిని మంజుల

పాల్వంచరూరల్: నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన విద్యార్థిని సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతూ ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తోంది. మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన రేగుల గూడెం గ్రామానికి చెందిన పోలేబోయిన ఎర్రయ్య, సుగణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్దకుమార్తె మంజుల భద్రాచలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో నర్సింగ్ కోర్సు చదువుతోంది. ఏడాది క్రితం అనారోగ్యంతో బాధపడుతుంటే ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరీక్షించి సికిల్‌సెల్ ఎనీమియాగా గుర్తించారు. ప్రతి నెలా రక్తాన్ని మార్చాల్సి ఉంటుందని, వారానికి రూ.2,500, నెలకు రూ.5వేల ఖరీదైన ఇంజెక్షన్లు వేసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో ఏడాది కాలం నుంచి రూ. ఐదు లక్షల వరకు ఖర్చు చేసి తల్లిదండ్రులు చికిత్స అందిస్తున్నారు. బిడ్డ కోసం ఇంట్లోని పశువులను కూడా అమ్ముకున్నారు. ఇంకా వైద్యం కోసం ఖర్చు పెట్టే ఆర్థిక స్తోమత లేదని తండ్రి ఎర్రయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మరోవైపు మంజుల ఆరోగ్యం క్షీణిస్తోంది. ఎడమ కాలు వంకర పోయి నడవలేని స్థితికి చేరడంతో కళాశాలకు వెళ్లి చదువుకోలేని పరిస్థితి నెలకొంది. దాతలు ఆదుకుని ఆర్థిక సాయం చేయాలని బాధితురాలి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

సహాయం కోసం..
అకౌంట్ నంబర్ : 7307180707–6
పేరు: పోలేబోయిన ఎర్రయ్య
బ్యాంక్: ఏపీజీవీబీ దమ్మపేట క్రాస్‌రోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఏపీజీవీ0004174

86 మంది పేదలకు కృత్రిమ పాదాలు


కృత్రిమ కాళ్లను అందజేస్తున్న మాజీ మంత్రి అజయ్, పక్కన నాగేశ్వరరావు, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎమ్మెల్యే, సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు జన్మదినం సందర్భంగా పేదలకు ఉచితంగా కృత్రిమ పాదాలను పంపిణీ చేశారు. ఖమ్మంలోని రోటరీ కమ్యూనిటీ సర్వీసెస్ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.3.44 లక్షల విలువైన కృత్రిమ పాదాలను 86 మందికి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తన తండ్రి 86వ జన్మదిన వేడుకల సందర్భంగా 86 మంది పేదలకు కృత్రిమ కాళ్లు అందజేసినట్లు తెలిపారు. ఖమ్మంలో ఇటీవల వరదల సమయాన బాధితులకు రోటరీ క్లబ్ సభ్యులు చేసిన సేవలు అభినందనీయమన్నారు. మమత ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ పువ్వాడ జయశ్రీ, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ మల్లాది వాసుదేవ్, డిప్యూటీ గవర్నర్ దొడ్డపనేని సాంబశివరావు, ఖమ్మం అధ్యక్ష, కార్యదర్శులు నల్లమోతు రవీంద్రనాథ్, హరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయకులకు పూజలు చేసిన మాజీ మంత్రి పువ్వాడ రేవతిసెంటర్, 52వ డివిజన్‌లో యూత్ విభాగం, కార్పొరేటర్ బుర్రి వెంకట్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు షేక్ షకీనా, దేవభక్తుని కిశోర్, కార్పొరేటర్ పల్లా రోజ్‌లీనా పాల్గొన్నారు.

మంత్రి పర్యటన.. ట్రాఫిక్‌లో అంబులెన్స్

మంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్‌లో ఓ అంబులెన్స్ చిక్కుకుపోయింది. శనివారం రాత్రి పాల్వంచ కేఎస్‌పీ రోడ్‌లోని రామ్ నగర్ వినాయక మండపాన్ని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో వాహనాలు రావడంతో ట్రాఫిక్ స్తంభించింది. అదే సమయంలో వస్తున్న ఓ అంబులెన్స్ సైరన్ మోగిస్తూ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. చాలాసేపటివరకు వాహనానికి దారి ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో పోలీసులు నానా తంటాలు పడ్డారు. కాగా ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. – పాల్వంచ


ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన అంబులెన్స్ వాహనం

ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం


విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ తదితరులు

ఖమ్మంసహకారనగర్: సమాజానికి ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సంస్థ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఖమ్మంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో శనివారం ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ పదో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 130 మంది విద్యార్థినులకు రూ.8 లక్షల విలువైన సైకిళ్లు, ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థినులకు ల్యాప్‌ట్యాప్‌లు, ఐదుగురికి కుట్టు మిషన్లు, పేద విద్యార్థులకు రూ.4 లక్షల స్కాలర్‌షిప్‌లు, వరద ప్రభావిత పాఠశాలల విద్యార్థులు 1,300 మందికి స్కూల్ బ్యాగ్ కిట్లు, 50 మంది దివ్యాంగులకు రూ.3 లక్షల విలువైన కృత్రిమ పాదాలు, ఐదు ట్రైసైకిళ్లను అందజేశారు. అలాగే, జిల్లాలోని 46 స్వచ్ఛంద సంస్థల బాధ్యులను సన్మానించారు. ఫౌండేషన్ యూఎస్ కోర్ కమిటీ సభ్యుడు బయ్యన బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, అదనపు డీసీపీ నరేశ్‌కుమార్, డీఈఓ సోమశేఖరశర్మ, కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ పాల్గొని ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు బోనాల రామకృష్ణ, యూఎస్ కోర్ కమిటీ సభ్యులు దొడ్డపునేని హరినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బండి నాగేశ్వరరావు, ఎన్‌ఆర్‌ఐలు చేపూరి లాక్స్, బండి సందీప్, కట్టా సాగర్, పసుమర్తి రంగారావు, దండ్యాల లక్ష్మణ్ రావు, తుక్కాని శ్రీనివాసరెడ్డి, బత్తుల రాజేశ్వరి, పద్మశ్రీ అవార్డీ వనజీవి రామయ్య, అన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షేమంగా ఇంటికి చేరిన విద్యార్థులు

ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు, కోయగూడెం ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు



కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో విచారణ చేస్తున్న ఏటీడీఓ రాధ

టేకులపల్లి: పాఠశాల నుంచి వెళ్లిపోయిన ఆరో తరగతి విద్యార్థులు ఇద్దరు శనివారం క్షేమంగా ఇంటికి చేరారు. లక్ష్మీదేవిపల్లి మండలం పెద్దతండా పంచాయతీ ఉయ్యాలబాడవ గ్రామానికి చెందిన ఈసం అభిరామ్, శెట్టుపల్లి గౌతమ్ తేజ కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నారు. వీరు శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి వెళ్లిపోయి ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో బస్సు ఎక్కి ఇల్లెందు క్రాస్‌రోడ్‌లో దిగారు. అక్కడి నుంచి కాలినడకన స్వగ్రామంవైపు వెళ్లారు. రాత్రి సమయంలో భయభ్రాంతులకు గురై గ్రామ సమీపంలోని పత్తి చేలో, స్థానిక ప్రాథమిక పాఠశాలలో గడిపారు. శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లే రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు వచ్చి ఇంటికి తీసుకెళ్లారు. పీఈటీ రాంబాబు పిల్లల గ్రామానికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏటీడీవో, హెచ్‌ఎం, వార్డెన్, టేకులపల్లి ఎస్‌ఐలు పిల్లల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. కాగా ఏటీడీఓ రాధ శనివారం ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులు, హెచ్‌ఎం, వార్డెన్, ఉపాధ్యాయులను విచారించారు. పాఠశాల నుంచి విద్యార్థులు బయటకు వెళ్లకుండా చూడాలని ఏటీడీఓ హెచ్చరించారు. వార్డెన్ నాగేశ్వరరావు, హెచ్‌ఎం అమర్‌సింగ్‌ల నుంచి రాతపూర్వకంగా వివరణ తీసుకున్నారు. కాగా ఇంటి మీద బెంగతో పిల్లలు చెప్పకుండా వెళ్లారని ఉపాధ్యాయులు తెలిపారు.

19న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా

సింగరేణి(కొత్తగూడెం) : 2323 – 24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో కార్మికులకు వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే ఈ నెల 25న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని, దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇక వరద బాధితుల సహాయార్థం కార్మికుల వేతనాల నుంచి కాకుండా డీఎంఎఫ్‌టీ, సీఎస్సార్ నిధుల నుంచి చెల్లించాలని డిమాండ్ చేశారు.

కిన్నెరసానిని సందర్శించిన జడ్జి


జడ్జి సుచరితకు మొక్క అందిస్తున్న వైల్డ్‌లైఫ్ సిబ్బంది

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని కొత్తగూడెం కోర్టు మొదటి అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.సుచరిత కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. వైల్డ్‌లైఫ్ సిబ్బంది జడ్జికి పూల మొక్క అందజేశారు.

రేపు హోమం, 17న కల్యాణం

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో టెంపుల్ ఆఫ్ యూఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ శాంతి యాత్ర ముగింపు పూజ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్యవైశ్య నిత్యాన్నదానం ట్రస్ట్ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శ్రీవాసవి కన్వెన్షన్ హాల్‌లో (శ్రీ ఆర్యవైశ్య నిత్యాన్నదానం ట్రస్ట్) ఈ నెల 16న హోమం, 17వ తేదీన సీతారామ కల్యాణం అత్యంత వైభవంగా జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

పిచ్చికుక్క దాడిలో మహిళకు తీవ్రగాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని బోయితండా గ్రామపంచాయతీ తుంటుబాలుతండా గ్రామంలో శుక్రవారం రాత్రి పిచ్చికుక్క దాడి చేయడంతో జ్ఞానేశ్వరి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వినాయకుని మండపం వద్ద పూజా కార్యక్రమాలకు హాజరై రాత్రి వేళలో ఇంటికి వెళ్తుండగా కుక్క దాడి చేసి కరిచింది. దీంతో శనివారం ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందింది.

రెండు మేకపోతులు అపహరణ

పాల్వంచ: పట్టణంలోని సీతారాంపట్నంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండు మేకపోతులను అపహరించారు. స్థానికుల కథనం ప్రకారం.. విష్ణు అనే వ్యక్తి కొన్ని మేకలు, గొర్రెలను పెంచుతున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ఇంటి ముందు దొడ్డిలో ఉంచిన మేక, గొర్రెపోతును ఓ కారులో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. అలికిడి మేల్కొని చూడగా అప్పటికే ఉడాయించారు. కాగా సీతారాంపట్నం ఏరియాలో వరుసగా చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ ఇంట్లో, తర్వాత ఓ దేవాయలంలో చోరీకి పాల్పడ్డారు.

60 వ్యవసాయ మోటార్లు చోరీ

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని సాగర్ కాల్వపై ఏర్పాటుచేసిన అరవై మోటార్లను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మోటార్లకు ఉన్న విద్యుత్ కనెక్షన్లు తొలగించి ఎత్తుకెళ్లారు. మోటార్లలోని కాపర్‌వైర్ కోసం దుండగులు చోరీ చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. సాగర్ కాల్వకు అనుసంధానంగా ఏర్పాటుచేసిన ఈ మోటార్ల ద్వారా చిన్న, సన్నకారు రైతులు వరి పంట పండిస్తున్నారు. కాల్వ వెంట కిలోమీటర్ పొడవునా మోటార్లను ఎత్తుకెళ్లగా బాధిత రైతుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


నాగేశ్వరరావు (ఫైల్)

చింతకాని: మండలంలోని నాగులవంచలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన కంభం నాగేశ్వరరావు (48) మృతి చెందగా, వేముల శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. బైక్ మెకానిక్ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు రాత్రి సమయాన ఖమ్మం – బోనకల్ ప్రధాన రహదారి వెంట వాకింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బోనకల్ మండలం ముష్టికుంట్లకు చెందిన బంధం నాగేశ్వరరావు బైక్‌పై ఖమ్మం వైపు వెళ్తూ వీరిద్దరిని ఢీకొట్టాడు. దీంతో కంభం నాగేశ్వరరావు, శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగేశ్వరరావు శనివారం మృతి చెందాడు. ఘటనపై ఆయన భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

మరో ప్రమాదంలో వ్యక్తి...

పెనుబల్లి: మండలంలోని కుప్పెనగుంట్లకు చెందిన సిరికొండ దేవస్వామి (50) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన శనివారం కిరాణం షాపునకు నడిచి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన నూనె వీరస్వామి బైక్‌పై వెళ్తూ దేవస్వామిని ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. దేవస్వామి కుమారుడు రవి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


మృతదేహం

ములకలపల్లి: మండల పరిధిలోని ఆనందపురం శివారులో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్సై రాజశేఖర్ కథనం మేరకు .. ఆనందపురం శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి మృతి చెందినట్లు స్థానికుల ద్వారా సమాచారం అందింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. సుమారు 55 ఏళ్ల వయసుగల వృద్ధుడు పాల్వంచ – మందలపల్లి రహదారి పక్కన చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడు నల్లరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, వివరాలు తెలిసిన వ్యక్తులు ములకలపల్లి ఎస్సై 87126 82058, పాల్వంచ సీఐ 87126 82048 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

జిల్లా సర్వజన ఆస్పత్రిలో..

కొత్తగూడెం అర్బన్: జిల్లా సర్వజన ఆస్పత్రిలో శనివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో త్రీటౌన్ పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి వయసు 50 ఏళ్లకు పైగా ఉంటుందని, వివరాలు తెలిస్తే 87126 82026 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.



వరద బాధితుల సహాయార్థం సీఎం రేవంత్ రెడ్డికి రూ.5 కోట్ల చెక్ ఇస్తున్న దివిస్ ల్యాబొరేటరీ సీఈవో డాక్టర్ కిరణ్

టైమ్స్ ప్రాపర్టీ షో ప్రారంభం



మాదాపూర్ (హైదరాబాద్): మాదాపూర్‌లోని హైటెక్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న టైమ్స్ ప్రాపర్టీ ఎక్స్‌పో–2024 శనివారం ప్రారంభమైంది. అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ బ్రాండ్ మేనేజర్ వెంకట్ రవి, లాన్సన్ ఎన్ పాయింట్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కియా కార్వంకర్, రాజపుష్ప ప్రాపర్టీస్ కార్తీక్ తదితరులు ప్రాపర్టీ షోను ప్రారంభించారు. ఎక్స్‌పోలో 50 మంది ప్రసిద్ధ డెవలపర్‌లు.. 150కి పైగా ప్రాజెక్టులను అందుబాటులో ఉంచారు. నగరంలో ప్రముఖ ప్రాజెక్టులు, అందుబాటులోని విల్లాలు, అపార్ట్‌మెంట్ల ప్లాట్ల సమాచారాన్ని సందర్శకులకు వివరిస్తున్నారు. కార్యక్రమంలో హానర్‌హోమ్స్ ఐశ్వర్య, అంకురా హోమ్స్ అవినాశ్, రాదేయ్ కన్‌స్ట్రక్షన్ మహమ్మద్‌గౌస్ అలీ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో కేజ్రీవాల్ పూజలు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ శనివారం కన్నాట్ ప్లేస్‌లోని ప్రఖ్యాత హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. భార్య సునీతతో పాటు వచ్చిన ఆయన ఆలయంలో పూజలు చేసి, ఆశీర్వచనం అందుకున్నారు. ఆప్ నేతలు, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ కూడా వారి వెంట ఉన్నారు. మద్యం కుంభకోణం కేసులో సుప్రీంకోర్టు బెయిలివ్వడంతో కేజ్రీవాల్ శుక్రవారం తీహార్ జైలు నుంచి విడుదలైన విషయం తెలిసిందే. అదేవిధంగా, కేజ్రీవాల్ తన నివాసంలో సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో చర్చలు జరిపారు.

డీమ్డ్ మెడికల్ కాలేజీలపై సర్కారు గరం

- యూజీసీ తీరును తప్పుబడుతున్న ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయం
- అవసరమైతే కోర్టుకు వెళ్లేలా యోచన
- 'సాక్షి' కథనం నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు మెడికల్, డెంటల్ కాలేజీలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదా ఇస్తున్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీరుపై రాష్ట్ర సర్కార్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయా లని భావిస్తోంది. అవసరమైతే కోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. శనివారం 'సాక్షి' లో 'వైద్య విద్య సీట్లపై ప్రైవేట్ కన్ను' శీర్షికతో ప్రచురితమైన కథనంపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో కన్వీనర్ కోటా, రిజర్వేషన్ కోటా సీట్లు తగ్గిపోయి మెరిట్, పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు మంత్రికి ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి, ఈ అంశం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, డీమ్డ్ వర్సిటీలను అడ్డుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్టుగా విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. దీనిపై కాళోజీ యూనివర్సిటీ అధికారులతోనూ మంత్రి సమీక్ష చేసినట్టు తెలిసింది. యూజీసీ తీరు బడుగు, బల హీన వర్గాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు తీరని అన్యాయం చేసే విధంగా ఉందని మంత్రి వ్యాఖ్యానించినట్టు అధికారులు చెబుతున్నారు.

'మల్లారెడ్డి' బాటలో మరికొన్ని కాలేజీలు!

మల్లారెడ్డి మెడికల్ కాలేజీలు, డెంటల్ కాలేజీలకు డీమ్డ్ వర్సిటీ హోదాను ఇస్తూ ఇటీవలే యూజీసీ నిర్ణయం తీసుకుంది. ఫీజుల ఖరారు, పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల మూల్యాంకనం వంటివన్నీ వర్సిటీ హోదాలో సొంతంగా చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. తెలంగాణ స్థానిక కోటా అమలు చేయాల్సిన అవసరం లేకుండా మినహాయింపులు ఇచ్చింది. దీంతో మల్లారెడ్డి కాలేజీల్లో ఉన్న 400 ఎంబీబీఎస్ సీట్లు, సుమారు 150 బీడీఎస్ (డెంటల్) సీట్లు పూర్తిగా మేనేజ్‌మెంట్ కోటాలోకి వెళ్లిపోయాయి. గతేడాది వరకూ ఇందులో సగం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేసేవారు. నీట్‌లో మంచి ర్యాంక్ సాధించిన ప్రతిభగల విద్యార్థులకు ఈ సీట్లు దక్కేవి. ర్యాంకు సాధించిన పేద విద్యార్థులకు ఉచితంగా మెడిసిన్ చదివే అవకాశం దక్కేది. మేనేజ్‌మెంట్ కోటా సీట్లలోనూ 85 శాతం తెలంగాణ విద్యార్థులకే కేటాయించేవారు. కానీ ఇకపై ఈ నిబంధనలు ఏవీ పాటించాల్సిన అవసరం లేకుండా యూజీసీ 'మల్లారెడ్డి'కి మినహాయింపులు ఇచ్చింది. 'మల్లారెడ్డి'చూపిన బాటలో అపోలో, సీఎంఆర్ కాలేజీలు కూడా డీమ్డ్ హోదా కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి దామోదర దీనిపై సీరియస్‌గా దృష్టి పెట్టారు.

కోట్లలో ఆదాయం!

డీమ్డ్ యూనివర్సిటీ హోదా తెచ్చుకుంటున్న మెడికల్ కాలేజీలకు రూ. వందల కోట్ల లబ్ధి చేకూరుతోంది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీటు ఫీజు రూ. 60 వేలు మాత్రమే ఉండగా, మేనేజ్‌మెంట్ కోటా ఫీజు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రెగ్యులేటరీ కమిటీ ఫీజులను నిర్ణయిస్తోంది. అయితే డీమ్డ్ యూనివర్సిటీలు ఈ కమిటీతో సంబంధం లేకుండా, సొంతంగానే తమ ఫీజులను నిర్ణయించుకునే అధికారాన్ని యూజీసీ కల్పిస్తోంది. మల్లారెడ్డి మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ ఫీజు సంవత్సరానికి రూ.17.5 లక్షలుగా ఉన్నట్టు కాళోజీ అధికారులు చెబుతున్నారు. గతంలో కన్వీనర్ కోటా ఫీజు కింద 200 సీట్లకు ఏడాదికి రూ.1.2 కోట్లు వస్తే, ఇప్పుడు అవే 200 సీట్లకు ఏడాదికి రూ.35 కోట్ల ఆదాయం వస్తుంది. ఒక్క బ్యాచ్ పూర్తయ్యేసరికి ఏకంగా రూ.175 కోట్లు సమకూరుతుంది.

సీబీఎస్‌ఈకీ మంగళం!



ఏపీలో పేదల విద్యపై చంద్రబాబు ప్రభుత్వ కక్ష సాధింపు

- ఈ పరీక్షలు రద్దుచేస్తూ నిర్ణయం
- రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో తిరోగమనంలో పాఠశాల విద్య
- మాజీ సీఎం జగన్‌పై కోపాన్ని పేద పిల్లలపై చూపుతున్న సర్కారు

సాక్షి, అమరావతి: మొన్న టోఫెల్.. నిన్న ఐబీ.. నేడు సీబీఎస్‌ఈ.. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో ఉన్నతాశయంతో పేద విద్యార్థుల భవిష్యత్తుకు వీటి ద్వారా బంగారు బాటలు వేస్తే ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం వాటిని ఒక్కొక్కటిగా అటకెక్కిస్తోంది. రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలన్న సత్సంకల్పంతో విద్యారంగంలో జగన్ అనేక సంస్కరణలు అమలుచేస్తే.. ఆయన మీద అక్కసుతో చంద్రబాబు సర్కారు పేద విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తూ పాఠశాల విద్యను తిరోగమనం బాట పట్టిస్తోంది. ఇందులో భాగంగా.. జగన్ అమలుచేసిన ఒక్కో అంశానికీ స్వస్తి చెబుతోంది. టోఫెల్, ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) బోధనకు ఇప్పటికే చరమగీతం పాడిన ఈ ప్రభుత్వం అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన ఊసెత్తడంలేదు. తాజాగా.. సీబీఎస్‌ఈ బోధనకూ తూచ్ అంటూ పేద పిల్లలకు అందుతున్న నాణ్యమైన విద్యను దూరం చేస్తోంది. ప్రభుత్వబడుల పీక పిసికేస్తోంది.

విద్యా సంవత్సరంలో మధ్యలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ బడులను అద్భుతంగా తీర్చిదిద్ది తల్లిదండ్రుల్లోను, విద్యార్థుల్లోను వాటిపై పెంచిన నమ్మకాన్ని చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా గత విద్యా సంవత్సరంలో వైఎస్ జగన్ సర్కారు 1,000 ప్రభుత్వోన్నత పాఠశాలల్లో సీబీఎస్‌ఈ బోధనను అమల్లోకి తెస్తే.. చంద్రబాబు సర్కారు ఈ విద్యా సంవత్సరం మధ్యలో దానిని రద్దుచేసేసింది. అధికారంలోకి రాగానే ఇంగ్లిష్ మీడియం రద్దుచేస్తామని మొన్నటి ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు బహిరంగంగా చేసిన ప్రకటనకు అనుగుణంగానే ఆయనిప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. అలాగే, విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన 'టోఫెల్'శిక్షణను అధికారంలోకి వచ్చీరాగానే జూన్‌లో రద్దుచేసి పారేశారు. ఇప్పుడు కొత్తగా ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు సీబీఎస్‌ఈ ప్రమాణాలను అందుకోలేకపోతున్నారని చెబుతూ 1,000 ప్రభుత్వ పాఠశాలల్లో అమల్లోకి తెచ్చిన సీబీఎస్‌ఈ బోధనను రద్దుచేశారు. అలాగే, విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న సాకుతో అక్కడి ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో బదిలీ చేసింది. ఇలా ప్రభుత్వ నిరంకుశ విధానాల కారణంగా.. ఇంగ్లిష్ మీడియం కోరుకునే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోతున్న పరిస్థితి రాష్ట్రంలో దాపురించింది.

జగన్‌పై కోపంతోనే విద్యపై అక్కసు..

'పేదలకు ఉచితంగా చదువు చెప్పడం ప్రభుత్వ బాధ్యత కాదు, ప్రభుత్వ బడుల్లో సదుపాయాలు ఉండవు, ప్రైవేటు బడులు బాగుంటాయి. డబ్బున్న వారు అక్కడ చదువుకుంటారు, మీరూ ఫీజులు కట్టి ప్రైవేటు స్కూళ్లకు వెళ్లండి'.. అని గతంలో సీఎం హోదాలో చంద్రబాబు బహిరంగంగా అన్నారు. దాదాపు 40 ఏళ్ల రాజకీయ అనుభవం, రాష్ట్రానికి 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన ఆయనకు పేదలన్నా.. పేదల పిల్లల చదువులన్నా ఎంత చులకనో ఈ మాటలే చెబుతున్నాయి. ఆయన తన నైజాన్ని మరోసారి రుజువు చేసుకుంటూ పేదల విద్యను నిర్వీర్యం చేసే చర్యలకు పూనుకున్నారు. ఇందులో భాగంగానే కార్పొరేట్ విద్యా సంస్థలకు బాహాటంగా కొమ్ముకాస్తూ రాష్ట్రంలో పేద పిల్లల చదువును పూర్తిగా అంధకారంలోకి నెట్టేస్తున్నారు. ఉదా.. గతంలో తక్కువ మంది విద్యార్థులున్నారని 2014–19 మధ్య 1,785 పాఠశాలలను మూసివేసి అక్కడి విద్యార్థులను గాలికొదిలేశారు. అలాగే, 4,300 ప్రభుత్వ పాఠశాలలను ఆయన హయాంలోనే మూసివేశారు. ఇప్పుడు వైఎస్ జగన్‌పై కోపంతో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ బోధనకు సైతం అదే గతి పట్టించారు.

విద్యా సంస్కరణలకు జగన్ శ్రీకారం..

పిల్లలకు మనమిచ్చే ఆస్తి ఏదైనా ఉందంటే అది నాణ్యమైన విద్య మాత్రమేనని, పేదరికం పోవాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని బలంగా నమ్మిన వైఎస్ జగన్ తన పాలనలో విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పేదింటి పిల్లలు అంతర్జాతీయంగా రాణించాలంటే వారికి ఇంగ్లిష్ మీడియం బోధన ఉండాలని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఏడాదికి ఒక తరగతి చొప్పున పెంచుతూ ఇంగ్లిష్ మీడియం అమలుచేశారు. మరోపక్క.. ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'టోఫెల్'ను సిలబస్‌లో అంతర్భాగం చేశారు. మరోపక్క.. జాతీయ విద్యా విధానం–2020లో భాగంగా రాష్ట్రంలోని ఎక్కువమంది విద్యార్థులకు సీబీఎస్‌ఈ విద్యను అందించేందుకు 1,000 ప్రభుత్వోన్నత పాఠశాలల్లో 2023–34 విద్యా సంవత్సరంలో 9వ తరగతి నుంచి సీబీఎస్‌ఈ బోధనను అందుబాటులోకి తెచ్చారు. దీంతో దాదాపు 84 లక్షల మంది విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరంలో సీబీఎస్‌ఈ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఒక యూనిట్ పరీక్షలు కూడా ముగిసిన తర్వాత ఉన్నపళంగా రాష్ట్ర ప్రభుత్వం సీబీఎస్‌ఈ పరీక్షా విధానం రద్దు చేసి విద్యార్థులను గందరగోళంలోకి నెట్టేసింది.

పదేళ్లు అధికారంలో ఉంటాం

▶ మొదటి పేజీ తరువాయి

నిరంతరం విషం చిమ్ముతుంటారని.. ప్రజల పక్షాన మాట్లాడేవారి కంటే విషం చిమ్మేవారు ఎక్కువైపోయారని వ్యాఖ్యానించారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మజ్లిస్ కలసి రావడం ఆనందంగా ఉంది

ప్రభుత్వాన్ని నడిపించడంలో కొన్ని తప్పిదాలు జరగవచ్చని, వాటిని ఎత్తి చూపేందుకు బలమైన ప్రతిపక్షం అవసరమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, తర్వాత అభివృద్ధి, సంక్షేమంలో అంతా కలిసి రావాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ రాజకీయంగా విభేదించినా.. తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కలసి రావడం ఆనందంగా ఉందని చెప్పారు. మూసీ నది అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో కొందరు పేదలు నివాసాలు కోల్పోయే అవకాశం ఉందని, వారికి ప్రభుత్వపరంగా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని రేవంత్ ప్రకటించారు. అన్ని మతాలు చెప్పింది ఒక్కటేనని, అందరం కలిసిమెలసి శాంతియుతంగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని రేవంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టెమ్రిస్ వైస్‌చైర్మన్ ఫహీమ్ ఖురేషీ, ఇస్లామిక్ స్కాలర్స్ పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

భద్రాచలంలో నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న ఉద్యోగులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్ర స్వామివారి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శనివారం ఓ భక్తుడు విరాళం అందజేశారు. ఏపీలోని ప్రకాశం జిల్లా పామూరు మండలం చిలంకూరుకు చెందిన దేవినేని శ్రీరాములు–బ్రహ్మణి దంపతులు రూ.50 వేల చెక్కును ఆలయ అధికారులకు అందజేసి స్వామివారిని దర్శించుకున్నా రు. ఈ మేరకు దాతలకు అధికారులు రసీదు, స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపిక అందజేశారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా చింతగుఫా పోలీస్‌స్టేషన్ పరిధి తుమాల్‌పాడ్ అటవీ ప్రాంతంలో పోలీసులు–మావోయిస్టులకు మధ్య శనివారం ఎదురుకాల్పులు జరిగాయి. చింతగుఫా పోలీస్‌స్టేషన్ నుంచి భద్రతా బలగాలు అటవీప్రాంతంలో కూంబింగ్‌కు బయలుదేరారు. తుమాల్‌పాడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల అనంతరం భద్రతా బలగాలు గాలించగా మావోయిస్టు మృతదేహం లభ్యమైంది. అంతేకాక ఘటనాస్థలి నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

బూడిద తరలించేందుకు దరఖాస్తుల స్వీకరణ

భద్రాచలంటౌన్: పాల్వంచలోని కేటీపీఎస్ నుంచి వెలువడుతున్న బూడిద (యాష్) తరలింపునకు అర్హులైన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. కేటీపీఎస్ 5, 6, 7వ దశల ప్లాంట్ల నుంచి వెలువడే బూడిద తరలింపునకు గిరిజన కాలుష్య ప్రభావిత ప్రాంతాలైన కరకవాగు, పునుకుల, పుల్లాయిగూడెం, సూరారం గ్రామాల గిరిజనులు అర్హులని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు పాల్వంచ కేటీపీఎస్‌తో పాటు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయాల్లో దరఖాస్తులు తీసుకుని ఈ నెల 25 సాయంత్రం 5 గంటల్లోగా కేటీపీఎస్, ఐటీడీఏ కార్యాలయాల్లో అందజేయాలని తెలిపారు. వివరాల కోసం 94906 12556, 94906 12557 (కేటీపీఎస్), 94415 07135 (ఐటీడీఏ) నంబర్లలో సంప్రదించాలని పీఓ శనివారం ఒక ప్రకటనలో సూచించారు.

ఏళ్లుగా దక్కని పదోన్నతులు

- కేటీపీఎస్ 5, 6వ దశల్లో జేపీఏ, పీఏలకు ఒకే కేడర్
- ఉద్యోగోన్నతులు లేక ఆందోళన
- తెలంగాణ ఏర్పడ్డాక కూడా పరిస్థితిలో కానరాని మార్పు



పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారం

పాల్వంచ: రాష్ట్రానికి వెలుగులు పంచే విద్యుత్ ఉద్యోగులను అడుగడుగునా సమస్యలు వెంటాడుతున్నాయి. కింది స్థాయి కేడర్ల ఉద్యోగుల విషయంలో యాజమాన్యం సరైన రీతిలో స్పందించడం లేదనే వాదన వినిపిస్తోంది. ఓ వైపు ఆర్టిజన్ కార్మికుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండగా, ఉద్యోగ, కార్మికులకు సైతం పదోన్నతులు దక్కడం లేదని వాపోతున్నారు. దశాబ్దాల తరబడి పదోన్నతులు లేక జూనియర్ ప్లాంట్ అటెండెంట్ (జేపీఏ), పీఏ ల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది.

నాలుగేళ్లుగా ఒకే స్థానంలో..

కర్మాగారంలో అధికారులతో పాటు జేపీఏల విధులు కీలకం. అన్ని విభాగాల్లో వీరు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా విధులు నిర్వర్తిస్తున్నారు. అధికారుల స్థాయి కేడర్‌కు కింద ఉద్యోగ, కార్మికులుగా వీరిని పరిగణిస్తుంటారు. అయితే 2000లో కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారంలో 425 మంది జేపీఏలుగా నియమితులయ్యారు. ఇందులో 161 మంది మాత్రం 2013లో పీఏలుగా పదోన్నతి పొందారు. మిగిలిన జేపీఏలు సంస్థలో చేరిన నాటి నుంచి ఒకే కేడర్‌లోనే ఉండటంతో మానసిక ఆందోళన చెందుతున్నారు. ఇక పీఏలుగా అప్‌గ్రేడ్ అయిన వారికి సైతం పదోన్నతులు దక్కలేదు. ఏఈ నుంచి డైరెక్టర్ స్థాయి వరకు ఇంజనీర్ల కేడర్లలో మూడు సార్లు పదోన్నతులు పొందగా ఈ కేడర్‌లో మాత్రం అడుగు ముందుకు పడడం లేదు.

మిగిలిన నాలుగు కేడర్లదీ అదే పరిస్థితి

జేపీఏలు పీఏలుగా పదోన్నతి పొందితే ఆపైన ఫోర్‌మెన్–4, ఫోర్‌మెన్–2, ఫోర్‌మెన్–1గా పదోన్నతులు ఇవ్వాలి. తద్వారా సంస్థపై ఎలాంటి ఆర్థిక భారం కూడా ఉండదు. ఇదిలా ఉండగా సంస్థ అనుమతితో కొందరు జేపీఏలు డిప్లొమా పూర్తి చేశారు. వీరికి సబ్ ఇంజనీర్లుగా పదోన్నతులు కల్పించాల్సి ఉంటుంది. అయినా పదోన్నతులు లేక ఆవేదన చెందుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు సైతం సీనియారిటీ ప్రకటించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక కూడా పదోన్నతులు లేక పోవడంపై ఉద్యోగుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, సీఎండీ స్పందించాలని ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

యాజమాన్యం పరిధిలో ఉంది



పదోన్నతుల అంశం యాజమాన్యం పరిధిలో ఉంది. మంజూరు పోస్టులు లేకపోవడం వల్లే పదోన్నతులు రావడం లేదు. అవసరమైన మేరకు గతంలో ఉద్యోగోన్నతులు ఇచ్చారు. అయితే, పోస్టులు పెంచాలని ఇక్కడి ఉద్యోగులు కోరుతున్నారు. కొత్త స్టేషన్లలో మాత్రమే ఇచ్చే అవకాశం ఉంటుంది. అయినప్పటికీ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–ఎం.ప్రభాకర్‌రావు, సీఈ, కేటీపీఎస్ 5, 6వ దశలు

పల్లెల్లో స్వచ్ఛతా హీ సేవా!

- ఈ నెల 17 నుంచి కార్యక్రమాల ప్రారంభం
- గాంధీ జయంతి వరకు నిర్వహించేలా షెడ్యూల్



కోనాయిగూడెంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

నేలకొండపల్లి: పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 (గాంధీ జయంతి)వ తేదీ వరకు ఇంకో కార్యక్రమం నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసింది. గాంధీ జయంతిని పురస్కరిచుకుని స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యాన స్వచ్ఛతా హీ సేవా పేరిట ఈ కార్యక్రమాల నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ప్రజల సహకారంతో కార్యక్రమాలు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 1,070 గ్రామ పంచాయతీల్లో చేపట్టే కార్యక్రమాల షెడ్యూల్‌ను అధికారులు సిద్ధం చేశారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్దే కాక ప్రజాపయోగ స్థలాలు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చెత్తాచెదారం, మురుగు తొలగిస్తారు. ప్రజలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల సహకారంతో ఆయా స్థలాలను పరిశుభ్రంగా మార్చనున్నారు. అంతేకాక కంపోస్ట్ షెడ్లలో తడి, పొడి చెత్త వేరు చేయడం, చెత్త నుంచి ప్లాస్టిక్, గాజు వస్తువులు వేరు చేయడం, మిగిలిన తడి చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చడం వంటి పనులు చేపడతారు. చివరి రోజైన అక్టోబర్ 2న గ్రామసభలో పారిశుద్ధ్య పనులు, ఇతరత్రా అంశాలపై చర్చిస్తారు. అంతేకాక ప్లాస్టిక్ నిషేధం, ప్రజలందరూ వస్త్ర సంచులే వినియోగించేలా అవగాహన కల్పిస్తారు.

అధికారులకు భారంగా పనులు

ప్రస్తుతం గ్రామాల్లో పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఇప్పటికే పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా ఇతరత్రా పనులు అధికారులకు భారంగా పరిణమిస్తున్నాయి. మళ్లీ స్వచ్ఛతా హీ సేవా పేరిట చేపట్టే కార్యక్రమం నిర్వహణను అధికారులే చూసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరగగా కొత్త ప్రాంతాల్లో అప్పులు చేసి పనులు నిర్వహించడం సవాల్‌గా మారనుందనే చర్చ జరుగుతోంది. మరోపక్క బదిలీ కార్యదర్శులకు బిల్లులు రాకపోవడంతో మనోవేదనలో ఉన్నారు. ఈ నేపథ్యాన నిధుల లేమి వెంటాడుతున్న పంచాయతీ ఉద్యోగులకు స్వచ్ఛతా హీ సేవా భారమేననే చర్చ జరుగుతోంది.

పకడ్బందీగా కార్యక్రమాల అమలు



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రకటించిన షెడ్యూల్ ఆధారంగా పనులు చేపట్టేలా ఉద్యోగులకు సూచనలు చేస్తాం. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల బాధ్యులను భాగస్వాములను చేయాల్సి ఉంటుంది.

–మర్రి ఎర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి



సీతారాం భౌతికకాయం వద్ద నాయకులు

సీతారాం ఏచూరికి నివాళులర్పించిన నేతలు

ఖమ్మంమయూరిసెంటర్: అనారోగ్యంతో కన్నుమూసిన సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని ఖమ్మం జిల్లా నాయకులు సందర్శించి నివాళులర్పించారు. శనివారం ఢిల్లీ వెళ్లిన నాయకులు ఏచూరి నివాసంలో నివాళులర్పించి మాట్లాడారు. సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఎం.ఏ.జబ్బార్, విష్ణువర్ధన్, ఎస్.నవీన్‌రెడ్డి, వాసిరెడ్డి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కథలపై అధ్యాపకుడికి డాక్టరేట్



కార్తీక్

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.కార్తీక్‌కు డాక్టరేట్ లభించింది. 'రైతు కథల్లో సామాజిక దృక్పథం – అనుశీలన'అంశంపై విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గజ్జా యోహన్‌బాబు పర్యవేక్షణలో పరిశోధనాత్మక గ్రంథం సమర్పించిన ఆయనకు రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా కార్తీక్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మమ్మద్ జకీరుల్లా, అధ్యాపకులు అభినందించారు. కాగా, నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కల్లేపల్లికి చెందిన కార్తీక్ కొన్నాళ్లుగా ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు.

సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని జవాన్ ఆత్మహత్య

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా గాదిరాస్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీఆర్‌పీఎఫ్ 226 బెటాలియన్ క్యాంపులో జవాన్ ఆత్మహత్య చేసుకున్నాడు. బెటాలియన్ క్యాంపులో పనిచేస్తున్న జవాన్ తన సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడిని అసోంకు చెందిన విపుల్ భయాన్‌గా గుర్తించారు. అయితే, విపుల్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్రస్థాయి బెంచ్‌ప్రెస్ టోర్నీలో ప్రతిభ



బెంచ్‌ప్రెస్ పోటీల్లో రాణించిన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: మేడ్చల్ జిల్లా బాలానగర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బెంచ్‌ప్రెస్ పోటీల్లో ఖమ్మం జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. మహిళల విభాగం 63 కేజీల కేటగిరీలో సీహెచ్ నగీన ప్రథమస్థానంలో నిలవగా, పురుషుల 74 కేజీల విభాగంలో ఉపేందర్ ద్వితీయ, 93 కేజీల్లో రాజా, 59 కేజీల్లో ఎస్‌కే సాబీర్, 105 కేజీల్లో ఎం.ప్రవన్, బి.కార్తీక్ విజేతలుగా నిలిచి టైటిల్ దక్కించుకున్నారు. అలాగే, సబ్ జూనియర్ విభాగం 53 కేజీల్లో ఐ.నాగరాజు, 66 కేజీల్లో సీహెచ్ యశ్వంత్, 83 కేజీల్లో ఎస్‌కే ఆర్య, టి.వివేక్, 120 కేజీల్లో సీహెచ్.రేవంత్ వరుసగా విజేతలుగా నిలిచారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోజ్ తెలిపారు.